క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను ల్యాండ్ ఫోన్ నంబరు 0884–2332326కు చేసి తెలపవచ్చన్నారు.

ఉరిమే ఉత్సాహం బాలల సొంతం



వేసవి శిబిరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దాపురం: ఉరిమే ఉత్సాహం బాలల సొంతమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో 34 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సభ శనివారం కూనిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ పిల్లల ప్రపంచం చాలా ఆనందమైందని, వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు. చదువు, ఆటలు, పాటలు, సైన్స్ ప్రయోగాల పట్ల పిల్లలు ఉత్సాహం చూపించారన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ ఇచ్చిన పీసీసీ కమిటీని అభినందించారు. పి.చలపతిరావు, బి.ఆనందరావు, బుద్ధా శ్రీనివాస్ తదితరులు ప్రసంగించగా ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పీసీసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా కూనిరెడ్డి అరుణ, గౌరవాధ్యక్షులుగా బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శిగా రొంగల అరుణ్, కోశాధికారిగా రవికుమార్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

చెరువులో చేపల వేట వద్దని వినతి

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందజేస్తున్న చెరువులో చేపల వేట అనుమతిని నిలిపివేయాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ డిమాండ్ చేశారు. రెండు రోజులుగా సామర్లకోట తాగునీటి చెరువులో చేపల వేట సాగుతున్నా మున్సిపల్ అధికారులు మౌనంగా ఉంటున్నారని అన్నారు. దీనిపై శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఇప్పటికే ప్రజలు కలుషిత జలాలతో ఇబ్బంది పడుతుండగా, చేపల వేటతో చెరువులో నీరు మరింత కలుషితం అవుతుందన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. పబ్లిక్ హెల్త్ అధికారులు తాగునీటి చెరువులో చేపలు పట్టడానికి అనుమతి ఇవ్వడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారుల తీరుపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకు వెళతామని హెచ్చరించారు.

బీజేపీ బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి కొండలరావు

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు బీజేపీ జిల్లా కార్యదర్శి గండి కొండలరావు తెలిపారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన బీజేపీ మోర్చాల నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీజేపీ మోర్చాలను బలోపేతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జ్ కొమ్మినీడి వీరభద్రం, పిఠాపురం పట్టణాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, అల్లుబోయిన సూరిబాబు, ఓలేటి వెంకటేశ్వరరావు, దొడ్డిపట్ల లక్ష్మీనారాయణ, పిల్లా ముత్యాలరావు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో పడి వ్యక్తి మృతి

కొత్తపల్లి: ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి ఉప్పుటేరులో పడి మృతి చెందినట్లు శనివారం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన అమలదాసు శ్రీను (30) తన బావమరిదితో శనివారం మధ్యాహ్నం ఉప్పుటేరు వద్ద బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి ఉప్పుటేరులో పడి మృతి చెందాడు. శ్రీనుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్: విజయవాడలోని సర్విజ్ఞ మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాకినాడ క్రీడాకారిణి పీఎస్ఆర్ఎస్ దీప్తి సునయన ప్రతిభ కనబరిచింది. 400 మీటర్ల అంశంలో పురుషులు, మహిళల వ్యక్తిగత విభాగంలో కాంస్యం పతకం సాధించింది. ఆమెను జిల్లా స్విమ్మింగ్ సంఘ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఐ.రాజు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

తల్లీ బిడ్డకో ఎక్స్‌ప్రెస్



పెద్దాపురం ఏరియా ఆసుపత్రి నుంచి బాలింతను ఇంటికి చేరుస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్



కాండ్రకోటలో 'డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వద్ద బాలింత, కుటుంబ సభ్యులు

- బాలింతల సేవలో ప్రభుత్వం
- డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌తో మేలు

పెద్దాపురం: ఆరోగ్యమే మహాభాగ్యం.. సగటు మనిషికి ఇదే ప్రధానం.. అలాంటి ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు నిరుపమానం.. వైద్య రంగంలో చేపట్టిన సంస్కరణలే అందుకు కొలమానం.. గర్భిణులను ప్రసవానికి తీసుకెళ్లడం, ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను ఆసుపత్రి నుంచి ఇంటికి క్షేమంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం 'డాక్టర్ వైఎస్సార్ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్' (102) సేవలను అందుబాటులోకి తెచ్చింది. బాలింత చేరే గమ్యం ఎంత దూరమైనా.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ముందుకు వచ్చి పైసా ఖర్చు లేకుండా క్షేమంగా ఇంటికి చేరుస్తోంది. పెద్దాపురం మండలం కాండ్రకోట, పులిమేరులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటికి ఒక్కొక్కటి చొప్పున తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఆధునీకరించి కేటాయించింది. పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి ఒకటి వాహనంతో కలపి రూరల్, పట్టణంలో మొత్తం 3 వాహనాలు ఉన్నాయి. ప్రతి వాహనానికి పైలెట్ (డ్రైవర్) ఉంటారు. గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్లడం, ప్రసవం అనంతరం ఇంటికీ సురక్షితంగా తరలించడం అతని ప్రధాన విధి. పెద్దాపురం డివిజన్ పరిధిలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఈ వాహనాలు మెరుగైన సేవలు అందిస్తున్నాయి. గర్భిణి సమాచారం ఎప్పటికప్పుడు ఆరోగ్య మిత్ర ద్వారా తెలుసుకుని తద్వారా డెలివరీకి ఆసుపత్రికి ఈ 102 వాహనాల ద్వారా తీసుకువెళ్తుంటారు.

గత ఆరు నెలల్లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సేవలు

పీహెచ్‌సీ	వాహనాలు	సేవలు పొందినవారు
కాండ్రకోట	1	73
పులిమేరు	1	42
పెద్దాపురం ఏరియా ఆసుపత్రి	1	420

అత్యంత ప్రాధాన్యం ఇచ్చి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చింది. తల్లీబిడ్డల సేవలో ఆధునీకరించిన వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. ఈ 102 వాహనాలు ఆయా ఆసుపత్రులకే పరిమితం కాకుండా సమీప మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా సేవలను అందిస్తున్నాయి. ఒక్కో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో అనేక మంది బాలింతలను ఇళ్లకు చేరుస్తున్నాయి. ఈ వాహనాల్లో బాలింతల ఆధార్‌తో సహా పూర్తి సమాచారాన్ని లాక్ బుక్, ఫీల్డ్ బుక్‌లలో నమోదు చేస్తారు. ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను పూర్తిగా ఉచితంగా ఇళ్లకు చేరుస్తున్నారు. దీంతో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సురక్షితంగా ఇంటికి..



మాది గండేపల్లి మండలం రామేశంపేట. నేను 9 నెలల గర్భిణిని కావడంతో ఇంట్లో వారి సమాచారంతో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ ఇంటికే వచ్చింది. వెంటనే పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తీసుకు వచ్చి వైద్య సేవలు అందించింది. అనంతరం తిరిగి నా చిన్నారితో పాటు నన్నూ సురక్షితంగా ఇంటికి చేర్చింది. మాలాంటి వారు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి ఇలా వైద్యం పొందాలంటే ఖర్చుతో కూడుకున్నది. ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ఉచితంగా, ఎటువంటి ప్రయాస లేకుండా సేవలు అందించడం చాలా బాగుంది.

– మణమ్మ, రామేశంపేట, గండేపల్లి మండలం

ఆనందం చూస్తున్నాం..



గతంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన బాలింతలు ఎవరికి వారే వాహనాలను ఏర్పాటు చేసుకుని ఇళ్లకు వెళ్లేవారు. అప్పుడు వారు ఎంతో వ్యయ ప్రయాసలు పడేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఎంత దూరమైనా సొంతిళ్లకు చేరుస్తోంది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో వారి కళ్లలో ఆనందం చూస్తున్నాం.

– అనిల్‌కుమార్, పైలెట్, 102 సర్వీసు పైలెట్, పెద్దాపురం

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



వీకే రాయపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వంగా గీత, దొరబాబు

ఎంపీ గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

సామర్లకోట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తుందని ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వీకే రాయపురం గ్రామంలో ఎంపీ నిధులు రూ.2.60 లక్షలతో శ్మశాన వాటికలో స్నానాల షెడ్లు, గ్రామంలో రూ.లక్షలతో నిర్మించే డ్రైన్ పనులకు వారు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ, ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు ఉటా వాసు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాధవపట్నంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు నిరుపమానం



వీకే రాయపురంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ గీత, దొరబాబు తదితరులు

సామర్లకోట: వలంటీర్ల సేవలు నిరుపమానమని ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని బోయనపూడి, వీకే రాయపురానికి చెందిన ఉత్తమ వలంటీర్లను శనివారం వీకే రాయపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలను ప్రజలకు నేరుగా అందజేయాలనే సంకల్పంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీ గీత అన్నారు. ఇప్పటికే వలంటీర్ల నుంచి అనేక మంది సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లక్షల కుటుంబాలకు మేలు జరుగుతుందని వివరించారు. సచివాలయాలతో ప్రజలకు సేవలు చేరువయ్యాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా అమలు చేస్తున్నారన్నారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లలో సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నగా రూ.20 వేలు, సేవా మిత్రగా రూ.10 వేలు అందజేసి సత్కరించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.లలిత, గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ, ఉప సర్పంచ్ సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం తదితరులు

సామర్లకోట: రైల్వేలో ఇక నుంచి ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా, ప్రతి చిన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజయవాడ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.శ్రీకాంత్ అన్నారు. ఒడిశాలో జరిగిన ఘోర ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి రైల్వే స్టేషన్‌లో నిర్వహిస్తున్న భద్రతా సదస్సుల్లో భాగంగా శనివారం సీనియర్ డివిజనల్ సేఫ్టీ అధికారి టి.శ్రీనాథ్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లో సదస్సు నిర్వహించారు. ఏడీఆర్ఎం ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రతి రైల్వే కార్మికుడు, ఉద్యోగి ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలన్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారంతో పాటు బుకింగ్ కౌంటర్, ప్రయాణికులు వేచి ఉండే గదులను పరిశీలించారు. ఇటీవల రైల్వే స్టేషన్‌లో విద్యుత్తు దీపాల సంఖ్యను పెంచినట్లు స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఏడీఆర్ఎంకు వివరించారు. డివిజనల్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు గురునాథ్, ఎండీవీఆర్ సత్యనారాయణ, ఖాజావల్లి హరినారాయణ, స్థానిక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు (సిగ్నల్) జోగారావు, దాసరి సాయిశంకర్ (ఇంజినీరింగ్) చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



అమరవిల్లిలో ఉండ్రాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు


కొత్తపల్లి: గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని అమరవిల్లిలో నూతనంగా నిర్మించే ఉండ్రాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచ్ పులి జయబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధితో పాటు ఏటా అమ్మవార్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించవలసిన బాధ్యత ఆలయ కమిటీ సభ్యులపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ స్థల దాత గుడిసే కాపురెడ్డి, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీపీ కారే సుధ, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ గోబు లోవకుమారి, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిను స్మరించి.. భక్తితో కొలిచి

శృంగార వల్లభుని ఆలయానికి భక్తుల రద్దీ



తిరుపతిలో శృంగారవల్లభ స్వామి



ఆలయంలో భక్తుల క్యూ

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పిలిచే శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి రద్దీ నెలకొంది. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గంటల తరబడి క్యూలో వేచిఉండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఆలయానికి శనివారం ఒక్కరోజే సుమారు రూ.3.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, సిబ్బంది కృష్ణ, సత్యనారాయణ, అంజనీకుమార్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- కొండపల్లిలో గడప గడపకూ..



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. శనివారం పెద్దాపురం మండలం కొండపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కనపర్తి చీమదొర, కేశారపు అయ్యన్న, పోకనాటి దుర్గారావు, ధనయ్య, కేదారి శ్రీనివాస్‌లతో కలసి గ్రామంలో దొరబాబు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ అందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మహిళాభివృద్ధి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, ఎస్ఎంసీ చైర్మన్ పోకనాటి శేషారావు, నల్లల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో ఉత్తమం

బోట్‌క్లబ్: రక్తదానం ఎంతో ఉత్తమమని కాకినాడ పోర్టు అధికారి కె.శ్రీధర్మశాస్త్ర అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో శనివారం రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్, షిప్పింగ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం అందక అనేకమంది చనిపోతున్నారన్నారు. రక్తదానంతో బాధితులను ఆదుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఎంపీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు వచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత ఎండాకాలంలో రక్త నిల్వలు లేకపోవడంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఏవీ రంగారావు, టీవీఎస్ రాజు, కేవీఎస్ సీతారాం, వి.నగధర్, వి.దుర్గామహేష్, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీకే రాయపురంలో పొలం వద్ద గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు

సామర్లకోట: ఎండలు మండిస్తున్నాయి.. సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఇది చాలదు అన్నట్లు కొందరు రైతులు తమ పొలాల్లో ఉన్న గడ్డికి నిప్పు పెడుతున్నారు. ఎండల వేడికి తోడు పొలాల్లో మంటలు ఇబ్బంది పెడుతున్నాయి. సమీప నివాసాల ప్రజలు అల్లాడుతున్నారు. శనివారం వీకే రాయపురంలో ఓ పొలంలో ఇలా మంటలు పెట్టారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్య స్పందిస్తూ పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం వల్ల భూసారం కోల్పోతుందని హెచ్చరించారు. వరి యంత్రాలతో కోతలు జరిగిన పొలంలో నీటిని నింపి లోతుగా దుక్కు దున్నుకోవాలని సూచించారు. దీనివల్ల ఎండు గడ్డి నీటిలో కుళ్లి భూసారం పెరుగుతుందన్నారు.

పరిపాలనపై అవగాహన అవసరం



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పరిపాలనపై జెడ్పీటీసీ సభ్యులు అవగాహన పెంచుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఈటీసీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పరిపాలన విధానంపై అవగాహన ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి వీలుంటుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ, నవరత్నాల పథకాలపై ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఈటీసీ ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు ప్రసాద్, ఎంఎస్ఎన్ రెడ్డి వివరించారు. శిక్షణ ముగించుకున్న జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

భార్య, పిల్లలను కిడ్నాప్ చేశారంటూ తప్పుడు ఫిర్యాదు

పిఠాపురం: తన భార్య, పిల్లలను కిడ్నాప్ చేశారని, వారిని కాపాడాలంటూ ఓ వ్యక్తి 100 నంబర్‌కు చేసిన కాల్ పోలీసులను హైరానాకు గురి చేసింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం కాకినాడ రూరల్ సర్పవరం ప్రాంతానికి చెందిన దాసరి రఘుకు పిఠాపురం పట్టణానికి చెందిన రాజ్యలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సర్పవరం కాపురానికి తీసుకెళ్లిన రఘు నిత్యం భార్యను వేధిస్తుండడంతో కొంత కాలంగా ఇద్దరి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సర్పవరంలోని తన నివాసంలో భార్యను చిత్ర హింసలకు గురి చేయడంతో తనను కాపాడాలంటూ ఆమె తన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఆమె తల్లిదండ్రులు వెళ్లి ఆమెతో కలిసి సర్పవరం పోలీసులకు రఘుపై ఫిర్యాదు చేసి ఆమెను తమ ఇంటికి పిఠాపురం తీసుకు వచ్చేశారు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై సర్పవరం పోలీసులు నిందితుడు రఘుకు ఫోన్ చేసి సర్పవరం పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పగా తాను ఇక్కడ లేనని వైజాగ్‌లో ఉన్నానని చెప్పాడు. ఉదయం రమ్మని చెప్పగా వస్తానని చెప్పాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాకా 100 నంబరుకు కాల్ చేసిన రఘు తన భార్య, పిల్లలను ఎవరో కిడ్నాప్ చేసి కారులో తీసుకుపోతున్నారని, వారిని కాపాడాలంటూ వేడుకున్నాడు. అదంతా నమ్మిన పోలీసులు వెంటనే అప్రమత్తమై కాకినాడ విశాఖ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. కాకినాడ సర్పవరం పోలీసులతో పాటు పిఠాపురం పోలీసులను అప్రమత్తం చేయడంతో అందరు తనిఖీలు నిర్వహించారు. ఒక పక్క తనిఖీలు నిర్వహిస్తునే పోలీసులు బాధితురాలి తమ్ముడి ఇంటికి వెళ్లి విచారించారు. కాగా అప్పటికే బాధితురాలు రాజ్యలక్ష్మి అక్కడే ఉండడంతో ఆమె నుంచి వివరాలు సేకరించి రఘు చేసింది తప్పుడు కాల్ అని నిర్ధారించుకున్నారు పోలీసులు. తనను రోజు చిత్ర హింసలకు గురిచేయడమే కాకుండా తనను కాపాడి తీసుకు వచ్చిన తల్లిదండ్రులపై కిడ్నాప్ చేశారంటూ తప్పుడు ఫిర్యాదు చేసిన తన భర్తపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు క్షేమంగా ఉన్నట్టుగా అన్ని ఆధారాలు సేకరించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు సుమారు 8 గంటల పాటు పోలీసులు హైరానా పడక తప్పలేదు.

పీస్ ఫర్ వాక్ విజయవంతానికి పిలుపు

కాకినాడ రూరల్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సామరస్య పూర్వకమైన భవిష్యత్తు కోసం యువతకు స్ఫూర్తినిస్తూ కాకినాడలో ఆదివారం ఉదయం పీస్ ఫర్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి రజనీ తెలిపారు. సర్పవరం జంక్షన్ వద్ద బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం జీ 20 దేశాల సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న సందర్భంగా కేంద్రం పిలుపునకు అనుగుణంగా పీస్ ఫర్ వాక్ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 6 గంటలకు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. సర్పవరం జంక్షన్ నుంచి వివేకానంద పార్కు వరకూ పాదయాత్ర జరుగుతుందని 15 నుంచి 40 ఏళ్ల మధ్య గల వారు పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో దిల్ రెడ్డి, బ్రహ్మకుమారీస్ గంగ, వాసవి, చంద్ర పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రండి

బోట్‌క్లబ్: మరణానంతరం నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు శ్రీనివాస్ అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్, లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నేత్రదాన దినోత్సవం జరిగింది. ప్రపంచ జనాభాలో దాదాపు 5 శాతం మంది కేవలం కార్నియా వ్యాధుల కారణంగా అంధులుగా మారుతున్నారన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఏ వయస్సు వారైనా నేత్రదానానికి ముందుకు రావొచ్చన్నారు. అనంతరం శ్రీనివాసను సత్కరించారు. క్లబ్ సభ్యులు ద్వారంపూడి విపుల్, అసోసియేషన్ సభ్యులు చైతన్య, వెదురుపాక సతీష్, రఘురాం పాల్గొన్నారు.